క్లుప్తంగా

సహకార సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

సైదాపూర్: వెన్కెపల్లి విశాల సహకార సంఘం భవన నిర్మాణానికి సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు... రైతుల సహకారంతో సంఘం అభివృద్ధి చెందుతోందని, సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చిన ఆదాయంతో మరిన్ని వ్యాపారాలు నెలకొల్పి సంఘం స్థిరాస్తులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఫంక్షన్ హాల్, పెట్రోల్ బంక్, గోదాంల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ గణేశ్, ఎంపీటీసీ సంతోష్, ఉపాధ్యక్షుడు కలకోటి కిషన్‌రావు, డైరెక్టర్లు మునిపాల రవి, బొమ్మగాని రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కిష్టంపల్లిని పంచాయతీగా గుర్తించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న వినోద్‌కుమార్

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించడానికి నాయకులు కృషి చేయాలని, గ్రామానికి చెందిన యువకుడు గొల్లపల్లి వినోద్‌కుమార్ వివిధ పార్టీల నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. వెంకట్రావుపల్లి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విన్నవించారు.

కంటి వైద్య శిబిరం


శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శుక్రవారం రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి పరీక్షలు చేసి 36 మందికి మోతెబిందు (కాటారాక్ట్) సమస్య ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో గుర్రం బాపురెడ్డి, గుడి అనంత రెడ్డి, పర్లెం లక్ష్మారెడ్డి, వద్దకొండ రవీందర్, ఇప్పలపల్లి శంకర్, ఇప్పలపల్లి లక్ష్మణ్, ఉడుత శ్రీనివాస్, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగాధర: జిల్లా కేంద్రంలో 13న నిర్వహించనున్న మాలల రాజకీయ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి నల్లాల రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గంగాధరలో చైతన్య సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలు మాలలకు అన్యాయం చేస్తున్నాయని, బహుజన సమాజ్‌వాదీ పార్టీ అన్నికులాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నాయకులు మహ్మద్ షమీమ్, రవీందర్, శేఖర్, నరేష్, మనోహర్, పొత్తూరి నరేష్, భూత్కూరి కాంత, సతీష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఇసుక తరలించొద్దని కలెక్టర్‌కు ఫిర్యాదు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామం మోయతుమ్మెద వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాను నిలిపివేయాలని గ్రామానికి చెందిన పిల్లి తిరుపతి, గుల్ల రాజు, బుర్ర శ్రీనివాస్, బోయిని వంశీకృష్ణ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గౌరవెల్లి సాగునీటి రిజర్వాయర్‌కు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయబావులు, బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతులు తీవ్రంగా నష్టపోతారని విన్నవించారు.

13న మండల సభ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో 13న ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో వేముల విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంటలు ఎండిపోవద్దని..

- వారబంధీ ముగిసినా సాగునీటి విడుదల
- డీబీఎం–11 కాలువ తూం షట్టర్ బోల్ట్ తొలగింపు
- నాలుగైదు రోజులు నిలిచిన నీటి సరఫరా, ఆందోళనలో రైతులు
- సుమారు 1500 ఎకరాల్లో వరిసాగు
- కాలువనీటిపై ఆధారపడిన అన్నదాతలు
- తాత్కాలిక మరమ్మతులు చేసి నీరందించిన అధికారులు


మరమ్మతుల అనంతరం కాలువలో ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ నీరు

శంకరపట్నం: ఎస్సారెస్పీ డీబీఎం–11 కాలువ తూం షట్టర్ బోల్టును గుర్తు తెలియని వ్యక్తులు తీసివేయడంతో ఐదురోజుల పాటు సాగునీరు నిలిచిపోయింది. దీంతో పంటలకు నీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మండలంలోని ఆముదాలపల్లి, తాడికల్ గ్రామాల ఆయకట్టు భూములకు కాలువ ద్వారా నీరు సరఫరా అవుతోంది. సుమారు 1500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఐదురోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోవడంతోపాటు మళ్లీ నీటివిడుదలకు ఆలస్యం అవుతుండటంతో రైతులు అధికారులకు సమాచారం అందించారు. గురువారం కాలువ తూం షట్టర్‌కు సిబ్బందితో పాటు ఓ రైతు కాలువలోకి దిగి మరమ్మతులు చేశారు. పంటలు ఎండిపోయే పరిస్థితి రాకూడదని అధికారులు వారబంధీ ముగిసినా ఆయకట్టుకు నీరు విడుదల చేయడంతో చివరి వరకు సాగునీరు చేరింది. అంబాల్‌పూర్, తాడికల్ రైతులకు సాగునీరు అందించడంతోపాటు అధికారులు తాడికల్‌లో చెరువులు, కుంటలు నింపనున్నారు. మండలంలో వారబంధీ ముగిసినప్పటికీ తాడికల్‌లో విడుదల చేశారు. ప్రధాన కాలువ నీటిపై ఆధారపడిన ఆయకట్టు రైతులు ఆశతో యాసంగిలో వరిసాగు చేశారు. పంటలకు వారబంధీ ముగిసినా సాగునీరు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నీటిని నిలిపివేశారు



కాలువనీటి ఆధారంగా ఉన్న నాలుగు ఎకరాలతోపాటు మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశాను. పంట పొట్టదశలో ఉన్నప్పుడు కాలువ తూం షట్టర్ మరమ్మతుతో నాలుగు రోజుల పాటు నీటిని నిలిపివేశారు. దీంతో వరి ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. మరమ్మతులతో వేల పెట్టుబడి పెట్టిన పంటకు నీరందింది.

– గడ్డి పర్వతాలు, రైతు, తాడికల్

కాలువనీరే దిక్కు



కాలువకింద రెండెకరాలకు బావిలేదు. కాలువ నీరే దిక్కు. యాసంగిలో నీరు విడుదలవుతుండటంతో వరి వేశాను. నాలుగైదు రోజులుగా నీరు నిలిపివేయడంతో ఆందోళన చెందాం. చేసేదిలేక అధికారులకు మొరపెట్టుకున్నాం. స్పందించిన అధికారులు చివరి నిమిషంలో నీటిని విడుదల చేయడంతో పంటలు ఎండిపోకుండా కాపాడుకున్నాం.

– దొంగల లక్ష్మయ్య, రైతు, తాడికల్

చెరువు, కుంటలు నింపుతాం



తాడికల్‌లో పంటలతో పాటు చెరువులు, కుంటలను డీబీఎం–11 కాలువనీటితో నింపుతం. వేసిన పంటలు ఎండిపోకుండా తూం షట్టర్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని విడుదల చేశాం. వారబంధీ ముగిసినప్పటికీ రైతుల విజ్ఞప్తి మేరకు నీరు విడుదల చేశాం.

– కవిత, డీఈ

వైద్య సిబ్బందికి సన్మానం


వైద్యులు, సిబ్బందిని సన్మానిస్తున్న కౌన్సిలర్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు కౌన్సిలర్ దేశిని రాధ సదానందం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వావిలాల పీహెచ్‌సీ వైద్యురాలు సనా జవేరియా, సూపర్‌వైజర్ అరుణాదేవి, ఏఎన్‌ఎం శ్రీవాణి, ఆశా వర్కర్స్‌ను శాలువాతో సన్మానించారు. కరోనా సమయంలోచేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చొప్పదండి: పురపాలక సంఘం ఆవరణలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ అధికారులు నిర్వహించిన పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ పరిశీలించారు. మెప్మా అధికారులు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలను మున్సిపల్ చైర్‌పర్సన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, మెప్మా సిబ్బంది మానస, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సైదాపూర్: మండలంలోని జాగీర్‌పల్లిలో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ డ్రోన్ ప్రాజెక్టు 2022–23లో భాగంగా గ్రామంలో 30 ఎకరాల వరిలో డ్రోన్ సహాయంతో నానో యూరియా పిచికారీ చేశారు. డ్రోన్ల వాడకం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని కేవీకే శాస్త్రవేత్తలు విజయ్, మహేశ్ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాంతమ్మ, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్కిల్స్ పెంచుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు కార్పొరేట్ స్కిల్స్ పెంపొందించుకోవాలని తెలంగాణ అకాడమీ ఆఫ్ సాఫ్ట్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ట్రైనర్ గడసంద సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్ వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో క్యాంపస్ టు కార్పొరేట్ అనే అంశంపై రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సినిమాల ప్రభావం, పాశ్చాత్య సంస్కృతిని విద్యార్థులు అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేషధారణ మార్చుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్‌కి సంబంధించిన అనేక అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ హనుమకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గంగాధర: మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన గంగాధర లచ్చయ్య,గంగామణి కూతురు చంద్రకళ వివాహానికి మైత్రి గ్రూప్స్ చైర్మన్ ఐదువేల ఆర్థికసాయం సమకూర్చగా నగదును మిత్రమండలి సభ్యులు శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో శ్రీసీతారామాలయం అభివృద్ధికి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చయ్య ఇరవైవేలు విరాళంగా అందజేశారు.

పాఠశాలలను సందర్శించిన మానిటరింగ్ బృందం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం మానిటరింగ్ బృందం సందర్శించింది. ఎస్సెస్సీ విద్యార్థుల ద్వారా పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహారెడ్డి, శ్రీనివాస్, అనంతచారి, శ్రీధర్, బాలాజీ , కొంరయ్యలు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో అపార అవకాశాలు


ప్రశంసా పత్రాలందజేస్తున్న రాజు, తదితరులు

హుజూరాబాద్‌రూరల్: విద్యుత్ రంగంలో అపర అవకాశాలు ఉన్నాయని భూపాల్‌పల్లి జిల్లా అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ పి.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ అధిపతి ప్రొఫెసర్ డా. ఎం.వి సతీష్‌కుమార్ అధ్యక్షతన కిట్స్ ఎలక్ట్రికల్ స్టూడెంట్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతర విద్యుత్ సరఫరా విద్యుత్ ఇంజినీర్ల ప్రథమ కర్తవ్యం అని, విద్యుత్ లేని జీవితం సాధ్యం కాదన్నారు. అనంతరం జేఎన్‌టీయూ పరీక్షలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, కేస సాంకేతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సమావేశంలో కిట్స్ అధ్యాపకుడు రాకేశ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగ అధిపతులు డా. యోగేశ్, వై పుండలీక్, వరంగల్ ఏడీఈలు సురేష్, సీహెచ్.రాజేశ్, రిజిస్ట్రార్ పి వెంకటయ్యలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ ఎదుగుదలను అడ్డుకోలేరు

చొప్పదండి: వైఎస్సార్‌టీపీ ఎదుగుదలను ఎవరూ అడ్డుకోలేరని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ అన్నారు. శుక్రవారం పట్టణంలో సావిత్రిబాయిపూలే వర్ధంతి నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలు పార్టీలో చేరగా కండువాలు కప్పి వైఎస్సార్‌టీపీలోకి ఆహ్వానించారు. వెంట స్రవంతి, పిట్టల పద్మ, కనుకయ్య, శ్రీనివాస్, నాగయ్య, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో కుంకుమపూజలు


కుంకుమపూజలో మహిళలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం కుంకుమపూజలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు మకరతోరణం, నక్షత్ర మంగళహారతి, చిన్నగంటను దాతలు ముదాం మధు, మోహన్, శ్రీకాంత్, పొనగంటి శైలజ బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆకుల రాజేందర్, మహేందర్, మాగంటి భాస్కర్, తిరుపతి, ధరణి, మధుకర్, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

వీణవంక: మండలంలోని వల్బాపూర్ గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం అగ్నిహోమం, జలాభిషేకం తదితర కార్యక్రమాలను వేదపండితులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహాఅన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాడ వనమాల సాదవరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతశ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ కామిడి కావ్యశ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రఘుపాల్‌రెడ్డి, ఉత్సవ కమిటీతోపాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో లేగదూడ మృతి

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లి గ్రామంలో కుక్కలదాడిలో లేగదూడ మృతిచెందింది. గ్రామానికి చెందిన గంట్ల రవీందర్‌రెడ్డి పంట పొలం వద్ద పశువులను కట్టి వేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున కుక్కలు లేగదూడపై దాడి చేసి చంపేశాయని, గ్రామంలో కుక్కలతో ఇబ్బందికర పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

తిమ్మాపూర్: మండలం లోని మహాత్మానగర్ కాలనీకి చెందిన వడ్లకొండ చంద్రయ్య రోజువారీలాగే తన వ్యవసాయ పొలం వద్ద గురువారం రాత్రి ఆవు, లేగ దూడను కట్టేశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే లేగదూడను పశువైద్యశాలకు తరలించాడు. లేగదూడ పరిస్థితి విషమంగా ఉందని రైతు తెలిపాడు.

ఫీల్డ్ విజిట్


కలబురిగి మార్కెట్ యార్డు నిర్వహణను వివరిస్తున్న సంతోష్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట మార్కెట్‌యార్డు పాలక వర్గం సభ్యులు శుక్రవారం కర్ణాటకలోని కలబురిగి (గుల్బర్గా) మార్కెట్ యార్డును సందర్శించారు. ఈసందర్భంగా మార్కెట్‌యార్డు కార్యదర్శి సంతోష్ యార్డు నిర్వహణను వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి


చొప్పదండి: నివాళి అర్పిస్తున్న ఏవైఎస్ నాయకులు


హుజూరాబాద్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు

చొప్పదండి: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతిని పట్టణంలో ఏవైఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏవైఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పెద్దెళ్ళి శ్రీనివాస్, కొత్త గంగారెడ్డి, లోక రాజేశ్వర్ రెడ్డి, రాజలింగం, శేఖర్, లచ్చయ్య, బాపురావు, డేవిడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి మహాత్మా జ్యోతిరావుపూలే కమిటీ చైర్మన్ కొలిపాక సమ్మయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్య కోసం ఆమె చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చందుపట్ల జనార్దన్, వేల్పుల రత్నం, ఖాలీద్ హుస్సేన్, తులసి లక్ష్మణమూర్తి, శేఖర్, రుద్రరాపు రాంచంద్రం, పసుల స్వామి, గంట మధు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చొప్పదండి: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ కోల రమేశ్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, చిలుక లింగయ్య, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


గంగాధర చౌరస్తాకు చేరుకున్న పాదయాత్ర

గంగాధర: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ చేపట్టాలని పదిరోజుల క్రితం చొప్పదండి మండల కేంద్రంలో ప్రారంభమైన మాదిగల సంగ్రామ పాదయాత్ర శుక్రవారం గంగాధర చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్నా బీజేపీ ప్రభుత్వ హామీ అమలుకావడంలేదన్నారు. వర్గీకరణ జరిగే వరకు ఉద్యమం ఆగదన్నారు. పాదయాత్రలో నాయకులు ప్రశాంత్, రాజయ్య, రాజన్న, దండు అంజయ్య, గంగాధర రఘు, గుంటుకు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా


మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారి సబిత

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. చిన్నారులకు ఐసీడీఎస్ అధికారులు అరవింద, సబిత, శోభారాణి పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రం పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ కవిత ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ


ప్యాడ్‌లు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

మానకొండూర్: హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ మానకొండూర్, జెడ్పీహెచ్ఎస్ వెల్ది, జెడ్పీహెచ్ఎస్ అన్నారం, జెడ్పీహెచ్ఎస్ పచ్చునూరు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీణవంక : మండలంలోని చల్లూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రస్ట్ నిర్వాహకులు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంఈవో శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ బాల్య దశలోనే విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని, పట్టుదల కృషి చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చాని అన్నారు. ట్రస్ట్ ద్వారా సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• గీతాకార్మికులకు తీవ్రగాయాలు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి రాజు అనే గీత కార్మికుడు శుక్రవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన గీత కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిరుపేద గీతా కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు కొండపాక రమేశ్‌గౌడ్, గౌడ కులస్థులు కోరారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన మార్క లింగయ్య శుక్రవారం తాటిచెట్టుపై నుంచి పడటంతో తీవ్రగాయాలయ్యాయని 108 సిబ్బంది తెలిపారు. లింగయ్యను హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో..

హుజూరాబాద్ రూరల్: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్‌లో హుజూరాబాద్ జమ్మికుంట రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఏబుసి రాజిరెడ్డి బస్టాండ్ సమీపంలో బస్సుకోసం ఎదురు చూస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామ సర్పంచ్ ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సర్వీస్ ద్వారా మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ నాయకుల దీక్ష

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శుక్రవారం బీజేపీ నాయకులు దీక్ష చేపట్టారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులను మాయమాటలతో మోసం చేస్తుందని, రుణమాఫీ, 24గంటల విద్యుత్, ధరణికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. వ్యవసాయనికి నాణ్యమైన విద్యుత్ అందించాలని, ఇచ్చిన హామీలు అమలు చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో వర్తింపచేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్